క్లుప్తంగా

ఈపీ గ్రీజర్ హెల్పర్ పోస్టుకు రాత పరీక్ష

మణుగూరుటౌన్: మణుగూరు ఏరియాలోని వివిధ విభాగాల్లో పనిచేస్తున్న ఈపీ గ్రీజర్ హెల్పర్ పోస్టు కోసం మంగళవారం మణుగూరు ఏరియాలోని బేస్ వర్క్‌షాపు, పీకే ఓసీలో ప్రాక్టికల్ పరీక్షలు నిర్వహించారు. ఏరియాలోని మొత్తం 57 పోస్టులకు నోటీఫికేషన్ ఇవ్వగా ఒక్కరు మాత్రమే దరఖాస్తు చేసుకోవడంతో కేవలం ఒక్క అభ్యర్థికి మాత్రమే పరీక్షలు నిర్వహించామన్నారు. అభ్యర్థి ఉత్తీర్ణత బట్టి ఏరియాలో అతనికి ఉద్యోగ అవకాశం కల్పించడం జరుగుతుందన్నారు. ఈ పరీక్షా నిర్వహణలో ఏరియా ఇన్‌చార్జ్ ఎస్వోటూ జీఎం వెంకటరమణ, ఏరియా పర్సనల్ అధికారి ఎస్.రమేష్, ఎస్ఈ రాజశేఖర్‌లు పాల్గొన్నారు.

వైభవంగా సుందరకాండ పారాయణం

భద్రాచలంటౌన్: భద్రాచలం పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్ వెనుక గల శ్రీ శివానంద ఆశ్రమంలో శ్రీ హనుమత్ సుందరకాండ పారాయణం కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని సుందరకాండ పారాయణం చేశారు. అనంతరం పేదలకు, అనాథలకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ అధ్యక్షురాలు కమలా రాజశేఖర్, సెక్రటరీ శ్రీలక్ష్మీ, మస్తాన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

ఇసుక ట్రాక్టర్లు సీజ్

ములకలపల్లి: అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్లను పోలీసులు మంగళవారం స్వాధీనం చేసుకున్నారు. ఎస్సై సాయికిషోర్ రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం... మండలపరిధిలోని గుర్రాలకుంట శివారు ముర్రేడు వాగు నుంచి ఇసుక అక్రమంగా తరలిస్తున్నట్లు సమాచారం మేరకు దాడులు నిర్వహించి, అనుమతి లేకుండా ఇసుక తోలుతున్న పది టాక్టర్లను సీజ్ చేశారు. అదే విధంగా అనుమతి పత్రాలు లేకుండా వస్తున్న మరోలారీని కూడా స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై తెలిపారు.

అక్రమంగా మట్టి తరలిస్తున్న ట్రాక్టర్లు..

అశ్వారావుపేటరూరల్: అనుమతులు లేకుండా మట్టి తవ్వకాలు చేసి తరలిస్తున్న ట్రాక్టర్లను మంగళవారం పట్టుకున్నారు. మండల కేంద్రం సమీపంలోగల పూసలకుంట నుంచి కొంత మంది వ్యక్తులు తవ్వకాలు చేపట్టి, అనుమతులు లేకుండా నాలుగు ట్రాక్టర్లలతో తరలిస్తుండగా సమాచారం అందుకున్న స్థానిక రెవెన్యూ అధికారులు వాటిని స్వాధీనం చేసుకున్నారు. సదరు ట్రాక్టర్లను స్థానిక తహసీల్దార్ కార్యాలయానికి తరలించారు. అనంతరం ట్రాక్టర్లకు జరిమానా విధించినట్లు తహసీల్దార్ లూథరస్ విల్సన్ తెలిపారు.

ఉపాధి పనులు ప్రారంభం

చండ్రుగొండ : మండలంలోని తుంగారం పంచాయితీ టేకులబంజర్ గ్రామంలో ఉపాధి హామీ పథకం పనులను మంగళవారం సర్పంచ్ బాణోత్ కుమారి ప్రారంభించారు. రైతుల భూములకు చదును చేసే పనులను చేపట్టారు. ఈ కార్యక్రమంలో బాణోత్ భీలునాయక్, సిబ్బంది పాల్గొన్నారు.

అభివృద్ధి బాటలో నియోజకవర్గం

అశ్వాపురం: ముఖ్యమంత్రి కేసీఆర్, మంత్రి కేటీఆర్‌ల సహకారంతో ప్రభుత్వ విప్, పినపాక ఎమ్మెల్యే రేగా కాంతారావు సారథ్యంలో పినపాక నియోజకవర్గం అభివృద్ధి బాట పడుతోందని జెడ్పీటీసీ సూదిరెడ్డి సులక్షణ, బీఆర్ఎస్ మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కోడి అమరేందర్, మర్రి మల్లారెడ్డి అన్నారు. పార్టీ స్థానిక కార్యాలయంలో మంగళవారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ. .నియోజవర్గానికి నిధులు మంజూరుపై వారు హర్షం వ్యక్తం చేశారు. నిధులు మంజూరు చేసిన సీఎం కేసీఆర్‌కు, ఎమ్మెల్యే రేగాకు కృతజ్ఞతలు తెలిపారు.

నిబంధనలు పాటించని వారిపై చర్య తీసుకోవాలి

భద్రాచలంటౌన్: భద్రాచలం పట్టణంలో నిబంధనలకు విరుద్ధంగా బహుళ అంతస్తులు నిర్మిస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని తుడుందెబ్బ జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీ తాటి లక్ష్మణ్ అన్నారు. పట్టణంలో మంగళవారం జరిగిన తుడుందెబ్బ డివిజన్ ముఖ్య నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడారు. వెంటనే పోడు భూములకు హక్కు పత్రాలు అందజేయాలన్నారు. గోపి, మోహన్, అనిల్, రామారావు, వేణు, రాజు పాల్గొన్నారు.

కార్పొరేట్ శక్తుల చేతుల్లో దేశసంపద

బూర్గంపాడు: దేశసంపదను కార్పొరేట్ శక్తులకు దారాదత్తం చేస్తున్న మోదీ సర్కార్‌ను సాగనంపాలని సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బి.అయోధ్య కోరారు. సారపాకలోని పార్టీ కార్యాలయంలో మంగళవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ... ఏప్రిల్ 14 నుంచి జిల్లాలో చేపట్టనున్న సీపీఐ పోరు బాటను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. మున్నా లక్ష్మీకుమారి, సారెడ్డి పుల్లారెడ్డి, సీతారామిరెడ్డి, పేరాల శ్రీనివాసరావు, పార్టీ మండల కార్యదర్శి మువ్వా వెంకటేశ్వరరావు, భిక్షం, శంకర్‌రెడ్డి, సాజీద్ పాల్గొన్నారు.

ఇంకెంత కాలం చూడాలి?!

- అభయహస్తం డబ్బుల కోసం ఏళ్ల తరబడిగా మహిళల ఎదురుచూపులు
- 2004లో రద్దయిన వైఎస్సార్ అభయహస్తం పథకం
- అప్పటి వరకు చెల్లించిన నగదు ఇస్తానన్న ప్రభుత్వం
- ఆ తర్వాత ప్రకటన లేక నిరాశ



స్వయం సహాయక సంఘాల కార్యాలయం



స్వయం సహాయక సంఘం గ్రూపు సభ్యుల సమావేశం (ఫైల్)

చర్ల: మండలంలో వైఎస్సార్ అభయహస్తం పథకం కింద మహిళలు చెల్లించిన డబ్బులకు అతీగతీ లేకుండా పోయింది. 2009లో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ఆధ్వర్యాన 'డాక్టర్ వైఎస్సార్ అభయహస్తం పథకం' రూపొందించారు. ఈ పథకం కింద కింద మహిళలు 2009 నుంచి 2014 వరకు ఐదేళ్ల పాటు నగదు చెల్లించారు. చర్ల మండలంలోని 26 జీపీల పరిధిలో 74 రెవెన్యూ గ్రామాలకు చెందిన 856 స్వయం సహాయక సంఘాల్లో 5,650 మంది 6పీమిచయం చెల్లించినట్లు గణాంకాలు చెబుతున్నారు. ఇందులో ప్రీమియం చెల్లించిన మహిళా కుటుంబాల్లో 9వ తరగతి నుంచి ఇంటర్ చదివే విద్యార్థులకు ఏటా రూ.1,200 స్కాలర్‌షిప్‌తో పాటు మహిళకు అరవై ఏళ్లు నిండాక నెలనెలా రూ 500 పెన్షన్ పొందే అవకాశం ఉంటుంది. ఇక ఇందిరమ్మ జీవిత బీమా కూడా వర్తించేవారు. కానీ తెలంగాణ ఏర్పడ్డాక ఈ పథకాన్ని రద్దు చేస్తూ.. ప్రీమియం చెల్లించిన వారికి తిరిగి ఇస్తామని ప్రకటించారు. కానీ తొమ్మిదేళ్లుగా ఆ నిధులు రాకపోవడం గమనార్హం.

5,500 మంది.. రూ 80.30 లక్షలు

మండలంలోని 26 గ్రామ పంచాయితీల పరిధిలో గల 74 రెవెన్యూ గ్రామాల్లో ఉన్న 856 స్వయం సహాయక సంఘాల్లోని 5,500 మంది సంవత్సరానికి రూ.365 చొప్పున నాలుగు నుంచి ఐదేళ్ల పాటు చెల్లించారు. వీరు చెల్లించిన మొత్తం రూ.80,30,000 కాగా.. వీటిని తిరిగి చెల్లిస్తామంటూ ప్రకటించిన టీఆర్ఎస్ ప్రభుత్వం ఇప్పటికీ తిరిగి చెల్లించలేదు. దీంతో అప్పట్లో అప్పులు చేసి కట్టిన మహిళలు కూడా ఉండగా అవి తిరిగి ప్రభుత్వం ఎప్పుడు చెల్లిస్తుందోనని ఏళ్ల తరబడిగా ఎదురు చూస్తూనే ఉన్నారు.

150 మందికి రూ.54.75 వేలు బాకీ

వైఎస్సార్ అభయహస్తం కింద 50 ఏళ్లు నిండిన సుమారు 150 మంది ఒకేసారి రూ.3,650 చెల్లించడంతో తరువాత పదేళ్ల పాటు ఏమీ చెల్లించాల్సిన అవసరం లేకుండా ఉంటుందని, 60 ఏళ్లు నిండగానే ప్రతీ నెల రూ 500 వస్తుందనడంతో మండలంలో సుమారు 150 మంది వృద్ధులు సుమారు రూ 54,75,00లు చెల్లించారు. వీరిలో సగానికి పైగా అందిన చోటల్లా అప్పట్లో అప్పులు చేసి మరీ చెల్లించారు. పథకం రద్దయ్యి తొమ్మిదేళ్లు కావస్తున్నా నేటికీ తిరిగి చెల్లించక పోవడంపై మహిళలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

త్వరగా తిరిగి చెల్లించాలి



వైఎస్సార్ అభయహస్తం పథకం కింద నాలుగేళ్ల పాటు చెల్లింపులు చేశాను. ఏడాదికి రూ365 చొప్పున నాలుగేళ్ల పాటు రూ.1,460లు చెల్లించారు. పతకాన్ని రద్దు చేసిన ప్రభుత్వం రద్దు చేసిన తెలంగాణా రాష్ట్ర ప్రభుత్వం తొమ్మిదేళ్లుగా అదుగో ఇదుగో అంటూ మా డబ్బులు మాకు చెల్లించే విషయంలో కాలం గడుపుతోంది. వెంటనే మా డబ్బులు మాకు చెల్లించాలి.

– చీదరగడ్డ మాధవి, రాళ్లగూడెం

అప్పు చేసి చెల్లించాను..



వైఎస్సార్ అభయహస్తం పతకం కింద నెల నెలా రూ.500 పింఛన్ వస్తోందన్న ఆశతో అప్పు చేసి ఒకేసారి రూ.3,650లు చెల్లించారు. పింఛన్ రాకపోగా కట్టిన డబ్బులు కూడా రాలేదు. ఐకేపీ అధికారులను అడిగితే వస్తాయిలే అంటున్నారే తప్ప ఎప్పుడు వస్తాయనేది చెప్పడం లేదు. ప్రభుత్వం వెంటనే మేము కట్టిన డబ్బులు మాకు తిరిగి చెల్లించాలి.

– సిద్ధి మార్తమ్మ, కుదునూరు

ఉన్నతాధికారులకు నివేదించాం

వైఎస్సార్ అభయహస్తం పథకం కింద డబ్బులు చెల్లించిన వారి వివరాలను ఉన్నతాధికారులకు పంపించాం. ఆరు నెలల క్రితం ప్రీమియం చెల్లించిన వారి వివరాలతో పాటు వారు చెల్లించిన సొమ్ము, వారి వ్యక్తిగత బ్యాంకు ఖాతా వివరాలను కూడా ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేశాం. ప్రభుత్వం నుంచి నేరుగా మహిళల బ్యాంకు ఖాతాలలోనే వారు చెల్లించిన సొమ్ము జమ అవుతుంది.

– దేవమణి, ఏపీఎం, ఐకేపీ, చర్ల మండలం

చిరుధాన్యాలతో సంపూర్ణ ఆరోగ్యం



అన్నపురెడ్డిపల్లి: చిన్నారులకు అక్షరాభ్యాసం చేస్తున్న సూపర్‌వైజర్ గంగాజలం



అశ్వారావుపేటరూరల్: రాగి జావ తయారీపై అవగాహన..

అన్నపురెడ్డిపల్లి: చిరుధాన్యాలతో సంపూర్ణ ఆరోగ్యం కలుగుతుందని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ గంగాజలం అన్నారు. పోషణ్ పక్వాడా కార్యక్రమంలో భాగంగా మండలంలోని భాస్కరపురం గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రంలో మంగళవారం చిన్నారులకు అక్షరాభ్యాసాలు చేయించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ సవలం రాణి, టీచర్లు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

అశ్వారావుపేటరూరల్: చిరు ధాన్యాలతో తయారీ చేసిన ఆహారాన్ని తీసుకోవడంతో తల్లిబిడ్డ ఆరోగ్యంగా ఉంటారని సీడీపీఓ రోజా రాణి అన్నారు. మండల కేంద్రంలోని దొంతికుంట వద్దగల అంగన్‌వాడీ కేంద్రంలో గర్భిణులు, బాలింతలకు చిరు ధాన్యాలతో ఆహార పదార్థాలను తయారుచేసి అవగాహన కల్పించారు. సూపర్ వైజర్లు కే విజయలక్ష్మీ, సౌజన్య, పద్మావతి, వరలక్ష్మీ, సీహెచ్ఓ కె.సింధు, అంగన్‌వాడీ టీచర్లు సరస్వతి, నాగేశ్వరమ్మ, ఆయాలు పాల్గొన్నారు.

ములకలపల్లి: మండలంలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో పోషణ్ పక్వాడ్ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా దమ్మపేట క్లస్టర్ సీడీపీఓ వీ, జ్యోతి మాట్లాడారు. సూపర్‌వైజర్ మధవి, గుండాలపాడు సర్పంచ్ కారం కుమారి, అంగన్‌వాడీ సిబ్బంది, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. పూసుగూడెం సెక్టార్ పరిధిలోని చాపరాపలపల్లి జీపీలోని కుమ్మరిపాడు గ్రామంలో సర్పంచ్ సవలం సుజాత, సూపర్‌వైజర్ జ్ఞానసుందరి ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సొసైటీ అభివృద్ధికి సహకరించాలి



మాట్లాడుతున్న చైర్ పర్సన్ సునంద

ములకలపల్లి: ములకలపల్లి సొసైటీ మహాజన సభ మంగళవారం సాదాసీదాగా జరిగింది. స్థానిక పీఏసీఎస్ కార్యాలయంలో జరిగిన సభకు చైర్‌పర్సన్ నడిపల్లి సునంద అధ్యక్షత వహించగా ఇన్‌చార్జ్ సీఈఓ మురళి వార్షిక నివేదిక సమర్పించారు. అనంతరం చైర్‌పర్సన్ మాట్లాడుతూ సకాలంలో రుణాలు చెల్లించి సంఘ అభివృద్ధికి సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ అధ్యక్షుడు కరుటూరి కృష్ణ, డైరెక్టర్లు అనుమల సత్యనారాయణ, ఊకంటి రవికుమార్, కర్నాటి కాంతారావు, జుబ్బూరి గోపాలరావు, కుంజా కృష్ణ, నడిపల్లి నవీన్‌కుమార్, అన్నవరపు సత్యనారాయణ, పుష్పాల చందర్‌రావు, పాలకుర్తి ప్రసాద్, గోపగాని లక్ష్మీనర్సు, రాంబాబు, వర్సా శ్రీరాములు, బైరు ప్రసాద్ పాల్గొన్నారు.

'ప్రతిపక్షం లేకుండా చేసేందుకు కుట్ర'



చండ్రుగొండ : దీక్షా శిబిరంలో మాజీ ఎమ్మెల్యే తాటి వెంకటేశ్వర్లు, నాయకులు



మణుగూరు రూరల్ : దీక్షలో కూర్చున్న కాంగ్రెస్ నాయకులు

చండ్రుగొండ : ప్రతిపక్షం లేకుండా చేయాలన్నదే లక్ష్యంగా బీజేపీ నాయకులు కుట్రలు అమలు చేస్తున్నారని, దేశంలో రాజకీయ ఉగ్రవాదులుగా బీజేపీ నేతలు వ్యవహరిస్తున్నారని కాంగ్రెస్ నాయకులు, జెడ్పీటీసీ కొడకండ్ల వెంకటరెడ్డి విమర్శించారు. రాహుల్‌గాంధీపై పార్లమెంటులో అనర్హత వేటు వేయడాన్ని నిరసిస్తూ పార్టీ ఆధ్వర్యంలో మంగళవారం చేపట్టిన నిరసన దీక్షల్లో రెడ్డి పాల్గొని మాట్లాడారు. ఈ దీక్షకు మాజీ ఎమ్మెల్యే టీపీసీసీ కార్యదర్శి తాటి వెంకటేశ్వర్లు, టీపీసీసీ సభ్యురాలు వగ్గెల పూజ సంఘీభావం తెలిపారు. సాయంత్రం దీక్షాపరులకు నిమ్మరసం ఇచ్చి దీక్ష విరమింపజేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్‌లు పద్దం వినోద్, దారావత్ పార్వతి, మాజీ సర్పంచ్ రుక్మిణి, బడుగు కృష్ణవేణి, మాజీ ఎంపీపీ గుగులోతు బాబు, కేశబోయిన నర్సింహారావు, ఇంజం అప్పారావు, బొర్రా సురేష్, ఎస్కే మదార్‌సాబ్, ఎండి. అన్వర్, సీహెచ్ రాములు, అంతటి రామకృష్ణ, మనోహర్ పాల్గొన్నారు.

మణుగూరు రూరల్ : రాహుల్ గాంధీ లోక్‌సభ సభ్యత్వాన్ని రద్దు చేయడాన్ని నిరసిస్తూ కాంగ్రెస్ మండల కమిటీ ఆధ్వర్యంలో అంబేడ్కర్ సెంటర్‌లో నాయకులు ఒక్క రోజు సంకల్ప సత్యాగ్రహ నిరసన దీక్షను చేపట్టారు. ఈ దీక్షకు టీడీపీ, సీపీఐ, టీజేఎస్ నాయకులు సంపూర్ణ మద్దతు తెలిపారు. నాయకులు చందా లింగయ్యదొర, కాటిబోయిన నాగేశ్వరరావు, చందా సంతోష్‌కుమార్ బీరం సుధాకర్‌రెడ్డి, పీరినాకి నవీన్, గాదె కేశవరెడ్డి, ఇక్బాల్ హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.


ఉత్సాహంగా పాఠశాల వార్షికోత్సవం



నృత్యం చేస్తున్న విద్యార్థులు

చర్ల: మండలంలోని ఆర్ కొత్తగూడెంలో గల శ్రీ రామచంద్ర (కేరళ మోడల్) స్కూల్ వార్షికోత్సవం మంగళవారం ఉత్సాహంగా సాగింది. స్కూల్ కరస్పాండెంట్ కృష్ణార్జునరావు అధ్యక్షతన జరిగిన వార్షికోత్సవ సభలో తహసీల్దార్ బి.భరణిబాబు మాట్లాడారు. ఈ సందర్భంగా విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. ఈ కార్యక్రమంలో సహకార సంఘం మాజీ ఉపాధ్యక్షుడు గొట్టిముక్కల సీతారామరాజు, గురుదేవ్ విద్యాలయం ప్రిన్సిపాల్ హెచ్‌జీవీ గిరిబాబు, గ్రామీణ వైద్యుల సంక్షేమ సంఘం నాయకులు వై.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ఘనంగా బ్రహ్మోత్సవాలు



హోమం నిర్వహిస్తున్న అర్చకులు

బూర్గంపాడు: నాగినేనిప్రోలు రెడ్డిపాలెం రామాలయంలో స్వామివారి బ్రహ్మోత్సవాలు వైభవంగా ప్రారంభమయ్యాయి. అర్చకులు మురళీ కృష్ణమాచార్యుల ఆధ్వర్యంలో వేదపండితులు సాయికుమార్ చార్యులు, సత్య ద్వారకప్రసాద్‌లు శాస్త్రోక్తంగా పూజలు నిర్వహించారు. భక్తులకు తీర్థప్రసాదాల వితరణ చేశారు. ఆలయ కమిటీ ప్రతినిధులు దొపాటి కృష్ణయ్య, మొండెద్దుల వెంకటేశ్వర్‌రెడ్డి, బూసిరెడ్డి వీరారెడ్డి, యడమకంటి పిచ్చిరెడ్డి, బిజ్జం శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆత్మీయ సమ్మేళనాలను జయప్రదం చేయాలి

మణుగూరు రూరల్ : ఏప్రిల్ 3, 4 తేదీల్లో జరగబోయే ఆత్మీయ సమ్మేళనాలను జయప్రదం చేయాలని మణుగూరు జెడ్పీటీసీ పోశం నరసింహారావు బీఆర్ఎస్ శ్రేణులకు పిలుపునిచ్చారు. ఈ మేరకు మంగళవారం స్థానిక బీఆర్ఎస్ కార్యాలయంలో పట్టణాధ్యక్షుడు అడపా అప్పారావు అధ్యక్షతన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొనాలని పిలుపునిచ్చారు. పీఏసీఎస్ చైర్మన్ కుర్రి నాగేశ్వరరావు, అసంఘటిత రంగ కార్మిక సంఘం అధ్యక్షుడు కత్తి రాము, పట్టణ ప్రధాన కార్యదర్శి బొలిశెట్టి నవీన్, యాదగిరిగౌడ్, వెంకటరెడ్డి, మహిళా అధ్యక్షురాలు చంద్రకళ, యూత్ పట్టణ అధ్యక్షుడు రుద్ర వెంకట్ పాల్గొన్నారు.

వైభవంగా పర్ణశాలలో ధ్వజారోహణం



పూజలు చేస్తున్న అర్చకులు

దుమ్ముగూడెం: ప్రముఖ పుణ్యక్షేత్రమైన పర్ణశాల దేవాలయంలో నవానిక ధ్వజారోహణ తిరు కల్యాణ మహోత్సవ కార్యక్రమాలను మంగళవారం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మూడో రోజు ఉదయం 10 గంటలకు ఆలయ అర్చకులు అగ్ని ప్రతిష్ఠ, ధ్వజారోహణ నిర్వహించారు. సాయంకాలం స్వామి వారి యొక్క తిరువీధి సేవా కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

చలివేంద్రాల ఏర్పాటు అభినందనీయం



మాట్లాడుతున్న ఎమ్మెల్యే వీరయ్య

భద్రాచలంటౌన్: భద్రాచలం పట్టణంలోని కూనవరం రోడ్డు రాజీవ్ గాంధీ సెంటర్‌లో ఓం శ్రీ సాయి యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ఎమ్మెల్యే పొదెం వీరయ్య మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... రోజు రోజుకు పెరుగుతున్న ఎండలు, శ్రీరామనవమి నేపథ్యంలో చలివేంద్రాలు ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షుడు సాయి బోయిన శ్రీనివాసరావు, బుడగం శ్రీనివాస్, బోగాల శ్రీనివాసరెడ్డి, యండి.బాబాజీ, చిన్నారావు, నాగు, ఆంజనేయశాస్త్రీ, ప్రభాకర్, శేషు, రామకృష్ణ, లక్ష్మణ్, నిర్మాలానందం, నాగార్జున, శ్రీకాంత్, వంశీ తదితరులు పాల్గొన్నారు.

తక్కువ ఖర్చుతో దిగుబడులు సాధించాలి



రైతులకు అవగాహన కల్పిస్తున్న దృశ్యం

అశ్వారావుపేటరూరల్: రైతులు ప్రస్తుతం అందుబాటులో ఉన్న సాంకేతికతను సద్వినియోగం చేసుకొని తక్కువ ఖర్చుతో అధిక దిగుబడులు సాధించేలా కృషి చేయాలని అశ్వారావుపేట వ్యవసాయ కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ సయ్యద్ అహ్మద్ హుస్సేన్ అన్నారు. స్థానిక కళాశాలలో మంగళవారం రైతులకు ఇఫ్కో తెలంగాణ ఆధ్వర్యంలో నానో యూరియా, నానో డీఏపీ వినియోగంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... రైతులు సాగు చేసే ఆయిల్‌పాం, మిరప, మొక్కజొన్న, పత్తి పంటల్లో తక్కువ ఖర్చుతో ఎక్కువ దిగుబడులు, లాభాలు వచ్చే పద్ధతుల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో ప్రొఫెసర్లు డాక్టర్ ఐవీఎస్ రెడ్డి, డాక్టర్ గోపాలకృష్ణమూర్తి, డాక్టర్ రాంప్రసాద్, డి.స్రవంతి, ఇఫ్కో ఖమ్మం జిల్లా అధికారి నాగార్జున, గిరిరాజు, డాక్టర్ పావని, రైతులు పాల్గొన్నారు.

సృజనాత్మకతతో ఉన్నత విద్య..



పరీక్ష ప్యాడ్లు అందజేస్తున్న అధికారులు

మణుగూరుటౌన్: ఉన్నత విద్యా ప్రమాణాలకు నిలయం సింగరేణి స్కూల్స్ అని మణుగూరు ఏరియా ఇన్‌చార్జ్ ఎస్వోటూ జీఎం వెంకటరమణ అన్నారు. మంగళవారం మణుగూరు పీవీకాలనీ సింగరేణి స్కూల్‌లో ఏర్పాటు చేసిన పదో తరగతి విద్యార్థుల వీడ్కోలు సమావేశంలో ఆయన ముఖ్యఅతిథిగా మాట్లాడారు. సింగరేణి యాజమాన్యం ప్రైవేటు పాఠశాలలకు ధీటుగా విద్యార్థులకు సకల సౌకర్యాలు కల్పిస్తూ వైజ్ఞానిక సృజనాత్మకతతో కూడిన ఉన్న విద్యను అందించడం జరుగుతుందన్నారు. సింగరేణి పాఠశాలల్లో చదువుకున్న అనేక మంది విద్యార్థులు నేడు ఉన్నత స్థాయిలో తమ ప్రతిభను చాటుకుంటున్నారన్నారు. క్రమశిక్షణతో చదువుతూ ప్రథమశ్రేణిలో ఉత్తీర్ణులు కావాలన్నారు. అనంతరం విద్యార్థులకు పరీక్షా ప్యాడ్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఏరియా డీజీఎం పర్సనల్ ఎస్.రమేష్, ప్రధానోపాధ్యాయురాలు స్వరూపరాణి, ఉపాధ్యాయులు ఆర్.కళ్యాణి, ఎస్.అనురాధ, ఎం.కృష్ణబాబు సిబ్బంది పాల్గొన్నారు.

అవకాశవాద రాజకీయాలు మానుకోవాలి



సమావేశంలో మాట్లాడుతున్న తిరుపతిరావు

భద్రాచలం: ఇన్నాళ్లు పదవులు అనుభవించిన వారు ఇప్పుడు అవకాశవాద రాజకీయాలు చేయడం సరికాదని బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు అరికెల తిరుపతిరావు అన్నారు. పట్టణంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ... మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాసరెడ్డితో పాటు డాక్టర్ తెల్లం వెంకట్రావులు మొన్నటి వరకు బీఆర్ఎస్‌లో పదవులు అనుభవించి ఇప్పుడు పార్టీని విమర్శించటం సరికాదన్నారు. కాగా, ప్రస్తుతం ఉన్న బీఆర్ఎస్ కార్యాలయ భవనాన్ని త్వరలోనే మార్చనున్నామని చెప్పారు. నాయకులు మానె రామకృష్ణ, తిప్పన సిద్దులు, రవికుమార్, శ్రీనివాస్, చిట్టిబాబు, యశోద నగేష్, రాంబాబు, పుల్లారావు, లోకేష్, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

విద్యార్థులు చదువులో రాణించాలి

అన్నపురెడ్డిపల్లి: విద్యార్థులు చదువులో రాణించి, ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని ఎస్సై షాహీనా అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ విద్యాలయంలో ఫ్రెండ్స్ ఫౌండేషన్ కొత్తగూడెం వారి ఆధ్వర్యంలో పదో తరగతి విద్యార్థినులకు అందించిన పరీక్ష కిట్లను ఆమె అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. పరీక్షల సమయంలో విద్యార్థులు ఒత్తిడికి లోనుకాకూడదన్నారు. ఈ కార్యక్రమంలో విద్యాలయ స్పెషల్ ఆఫీసర్ కవిత, ఫ్రెండ్స్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు శ్రీకాంత్, ఉపాధ్యాయులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



పరీక్ష కిట్లను అందజేస్తున్న ఎస్సై, తదితరులు



అటెన్షన్ ప్లీజ్

పక్కకు దిగితే పడిపోయినట్లే..



మండలంలోని పలు గ్రామాల్లో రాష్ట్రీయ రహదారికి బీటీ వేసిన ఆర్ అండ్‌బీ శాఖ అధికారులు సైడ్‌బర్మ్ వేయించడం మరిచారు. భద్రాచలం-వెంకటాపురం మార్గంలో చర్ల మండలంలోని రాళ్లగూడెం నుంచి తేగడ వంతెన వరకు పలు చోట్ల రోడ్డు దెబ్బతినగా దానిపై మళ్లీ బీటీ వేశారు. దీంతో రోడ్డు ఎత్తు పెరిగింది. అలాగే, గత ఏడాది భారీ వర్షాలకు రోడ్డు ప్రక్కన ఉన్న మట్టి కొట్టుకుపోయి ప్రమాదకరంగా మారింది. వాహనదారులు ఎదురెదురుగా వస్తే రోడ్డు దిగాలన్నా, తిరిగి ఎక్కాలన్నా అనువుగా లేకపోవడంతో ప్రమాదాలు జరుగుతున్నాయి. ఇకనైనా అధికారులు రోడ్డుకు సమాంతరంగా గ్రావెల్ వేయించాలని కోరుతున్నారు.

– చర్ల

ప్రశ్నించాల్సిన అధికారి : హరిలాల్, డీఈ, ఆర్‌అండ్‌బీ, భద్రాచలం
సెల్ నంబర్ : 9440818414